సాక్షి
కర్నూలు
శుక్రవారం । 16 । జూన్ । 2023



నిర్వహణ ఇలా ఉంటే ఎలా?
రిజిష్టర్లు సక్రమంగా లేకపోవడంతో ఎమ్మిగనూరు పట్టణంలోని అంగన్‌వాడీ సిబ్బందిపై రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో▸



పోటెత్తిన భక్తులు
మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు భక్తులు గురువారం పెద్ద సంఖ్యలో మంత్రాలయానికి తరలివచ్చారు. ద్వాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.



టీబీ డ్యాంకు నిలిచిన ఇన్‌ఫ్లో
హొళగుంద: తుంగభద్ర జలాశయానికి గురువారం ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతం జలాశయంలో 1581 అడుగుల వద్ద 4.975 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

న్యూస్‌రీల్

రైల్వే ప్రయాణికుల భద్రతే ముఖ్యం



మాట్లాడుతున్న డివిజినల్ రైల్వే మేనేజరు కె. వెంకట రమణారెడ్డి

ఆదోని సెంట్రల్: రైలులో ప్రయాణిస్తున్న వారిని సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడమే ముఖ్యమని డివిజినల్ రైల్వే మేనేజరు కె. వెంకట రమణారెడ్డి తెలిపారు. రైల్వే చీఫ్ ఇంజనీరు కార్యాలయంలో రైల్వే సిబ్బందికి గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రంలో జరిగిన రైల్వే ప్రమాదం అందరినీ కలచి వేసిందని, ట్రాక్ లైన్, సిగ్నల్ విషయంలో పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. టెక్నికల్ నుంచి లూప్‌లైన్‌లో ఉన్న సిబ్బంది వరకు అందరూ కలసి కట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ డీఈఎన్ కో ఆర్డినేటర్ అఖిల్ రెడ్డి, సీనియర్ డీసీఎం ప్రశాంత్‌కుమార్, సీనియర్ డీఎంఈసీ పుష్పరాజ్, సీనియర్ డీఎస్‌ఓ శ్రీరామ్‌నాయక్, డీఈఎన్ నార్త్ కిష్టప్ప, స్టేషన్ మేనేజరు ఎస్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

23 నుంచి 'జగనన్న సురక్ష'

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23వ తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి ఆయన స్పందన అంశాలపై కలెక్టర్లు, జేసీలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూఫ్ లెవల్, రూఫ్ కాంక్రీట్ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను జూలై ఆఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. జగనన్నకాలనీల్లో సెప్టెంబర్ 15లోపు మౌలిక వసతులు కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య పాల్గొన్నారు.

బిల్లుల మంజూరుకు ప్రాధాన్యం

- గత నెల 8న రూ.18 కోట్లు విడుదల
- తాజాగా రూ.22.10 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- పరుగులు తీస్తున్న ప్రాధాన్యత భవన నిర్మాణాలు
- అప్‌లోడ్ చేసిన వెంటనే గ్రీన్ చానల్ ద్వారా బిల్లుల విడుదల



ఆదోని మండలం గణేకల్లులో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాధాన్యత భవన నిర్మాణాలు వేగం పుంజుకుంటున్నాయి. వివిధ సాంకేతిక కారణాలతో బిల్లుల విడుదలలో నెలకొన్న స్వల్ప జాప్యాన్ని ప్రభుత్వం నివారించింది. పెండింగ్‌లో ఉన్న బిల్లులకు సంబంధించి గత నెల 8వ తేదీన రూ.18 కోట్లను విడుదల చేసింది. ఈ నెల 12న రూ.16.18 కోట్లు, 13న రూ.5.92 కోట్లను (మొత్తం రూ.22.10) విడుదల చేసింది. చేసిన పనులకు బిల్లులను అప్‌లోడ్ చేసే క్రమంలో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే తప్ప, అప్‌లోడ్ చేసిన బిల్లులకు గ్రీన్ చానల్ ద్వారా మరుసటి రోజే విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

సీసీ రోడ్లకు విడుదలైన నిధులు

గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ప్రాధాన్యత భవనాలతో పాటు జిల్లాలోని పలు గ్రామాల్లో కొత్తగా వేసిన సీసీ రోడ్లకు కూడా ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ఈ పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు వీలుగా నేరుగా సిమెంట్ కంపెనీల నుంచి సిమెంట్‌ను దిగుమతి చేయించడంతో పాటు ఇసుకను కూడా అందుబాటులో ఉంచింది.

నిర్ణీత సమయంలోగా పూర్తికి ప్రత్యేక చర్యలు

ప్రాధాన్యత భవనాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే ప్రతి వారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు సీఎస్, ఆయా శాఖలకు సంబంధించిన ప్రిన్సిపల్ సెక్రటరీలు, కమిషనర్లు వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూనే ఉన్నారు. అందుకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన వారం వారం అభివృద్ధి పనుల వేగం పెంచేందుకు సమీక్షలు నిర్వహిస్తూ ప్రతి నియోజకవర్గానికి, మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. ప్రస్తుతం చేసిన పనులకు కూడా ప్రభుత్వం గ్రీన్ చానల్ ద్వారా నిధులను విడుదల చేస్తున్నందున పనులు సకాలంలో పూర్తి కానున్నాయి.

ప్రాధాన్యత భవనాల పురోగతి ...

భవనం	మొత్తం మంజూరు	చేపట్టిన భవనాలు	అంచనావ్యయం (రూ.లక్షల్లో)	పూర్తి అయినవి	వేర్వేరుదశల్లో ఉన్నవి
గ్రామ సచివాలయాలు	458	391	రూ.18,320	147	244
రైతు భరోసా కేంద్రాలు	447	272	రూ.9744.40	89	183
వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్	354	211	రూ.6195	32	179
బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు	46	07	రూ.805	02	05
వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు	149	07	రూ.2458.50	--	07



ఆస్పరిలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం



డోన్ మండలం కొత్తపల్లిలో నిర్మించిన ఆర్‌బీకే

రూ. 375.25 కోట్లతో ఐదు రకాల భవనాలు

జిల్లాల్లో మొత్తం రూ.375.25 కోట్లతో ఆయా గ్రామాల్లో ప్రాధాన్యత భవన నిర్మాణాల పనులను ప్రారంభించారు. బల్క్‌మిల్క్ యూనిట్లు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణాల పనుల మంజూరులో కొంత జాప్యం కారణంగా పురోగతిలో కొంత వెనుకబడ్డాయి. మిగిలిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ నిర్మాణాల్లో ఆశించిన పురోగతి కనిపిస్తోంది. ఈ భవన నిర్మాణాలను ప్రాధాన్యతగా తీసుకొని వాటిని నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

అప్‌లోడ్ చేసిన వెంటనే బిల్లులు విడుదల



జిల్లాలో ప్రాధాన్యత భవనాలు, సీసీ రోడ్లు ఇతరత్రా అభివృద్ధి పనులకు బిల్లులు అప్‌లోడ్ చేసిన మరుసటి రోజే నిధులు విడుదల అవుతున్నాయి. ఈ పనులకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఇంకా రూ.258 కోట్లు సిద్ధంగా ఉన్నాయి. ఎక్కడైనా సాంకేతిక కారణాలతో బిల్లులు అప్‌లోడ్ చేయడంలో ఆలస్యం జరిగితే తప్ప ఇక నుంచి బిల్లుల విడుదలలో ఎలాంటి జాప్యం ఉండదు. క్షేత్ర స్థాయిలోని ఇంజినీర్లు కూడా ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పనుల్లో వేగం పెంచాలి.

– కే సుబ్రమణ్యం, పీఆర్ ఎస్ఈ

ఓపెన్ డిగ్రీలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఓపెన్ డిగ్రీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ సునీల్ కన్నా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో అడ్మిషన్‌కు ఇంటర్మీడియట్, ఏదైనా డిప్లమా ఒకేషనల్ తప్పనిసరిగా ఉత్తీర్ణులై ఉండాలన్నారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు.. పీజీలో తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, ఎకనామిక్స్, పొలిటికల్‌సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంకామ్ హిస్టరీ.. ఎంఎస్సీలో గణితం, సైకాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటితో పాటు ఈ సంవత్సరం బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ, ఫిజిక్స్ కోర్సులు కూడా అందుబాటులోకి రానున్నాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు వచ్చే నెల 31లోపు www.bsoau.ac.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకొని ఫీజులు చెల్లించి అడ్మిషన్ పొందాలన్నారు. పూర్తి వివరాలకు స్థానిక సిల్వర్‌జూబ్లీ కాలేజీలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ సెంటర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రూ.13.49 కోట్ల బీమా పరిహారం విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): 2021 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వివిధ కారణాలతో పెండింగ్‌లోని వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా క్లెయిమ్‌లకు సంబంధించి పరిహారం విడుదలైంది. భూములు ఎక్కువగా ఉండటం , బీమా పరిహారం కూడా భారీగా ఉండటం.. రెండు, మూడు మండలాల్లో భూములు కలిగి ఉండటం తదితర కారణాల వల్ల 2,528 మంది రైతులకు బీమా పరిహారం పెండింగ్‌లో ఉంది. వీటిపై వ్యవసాయ శాఖ కమిషనర్ మండల వ్యవసాయ అధికారులతో సమగ్ర విచారణ నిర్వహించారు. ఈ మేరకు జిల్లాకు చెందిన 2,528 మంది రైతులకు రూ.13.49 కోట్ల నగదు రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదలైంది. నంద్యాల జిల్లాలో 319 మంది రైతులకు రూ.2.19 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. 2021 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 2022 జూన్ 14న మొదటి విడతలో 2,21,705 మంది రైతులకు రూ.371.89 కోట్లు.. రెండవ విడతలో డిసెంబర్ 27న 6,615 మంది రైతులకు రూ.29.78 కోట్లు విడుదలైంది. తాజాగా గురువారం మూడో విడతలో 2,528 మంది రైతులకు రూ.13.49 కోట్లు విడుదల చేయడం విశేషం. రైతులు ప్రీమియం కింద ఒక్క రూపాయి చెల్లించకపోయినా బీమా కింద రూ.415.16 కోట్ల ప్రయోజనం లభించిందని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు.

విద్యార్థిని లూధియా మృతిపై విచారణ


విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న పావనమూర్తి

కృష్ణగిరి: కంబాలపాడు అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం 8వ తరగతి విద్యార్థిని లూధియా మృతి చెందగా, గురుకుల పాఠశాలల రాష్ట్ర సెక్రటరీ పావనమూర్తి గురువారం విచారణ జరిపారు. విద్యార్థిని మృతి గల కారణాలపై పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతురాలి స్వగ్రామమైన జి. మల్లాపురానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబంలో ఉన్న ఇద్దరు పిల్లలను తమ 11 సొసైటీల్లో ఎక్కడైనా చదివించుకునేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలల్లో ఉండే విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాయంత్రం సమయంలో తరగతి గది తెరిచి ఉంచడం ఏమిటని ప్రిన్సిపాల్ అరుణకుమారిని ప్రశ్నించారు. ఈయన వెంట డీసీఓ వెంకటరావ్, తహసీల్దార్ పురుషోత్తం, సీఐ యుగంధర్ ఉన్నారు.

‘ఎల్ఈడీ’ మాటున వెలిగిన మోసం!

- ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన ఆదోని పోలీసులు
- రూ.18.66 లక్షలు బ్యాంకు ఖాతా ఫ్రీజ్
- మూడు సెల్‌ఫోన్‌లు, బ్యాంకు పుస్తకాలు స్వాధీనం
- మోసపోయిన వెయ్యి మందికిపైగా బాధితులు
- రికవరీ చేసిన డబ్బు త్వరలో కోర్టు ద్వారా అందజేత
- వివరాలు వెల్లడించిన ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి


నిందితుల అరెస్ట్ చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని అర్బన్: సాంకేతిక విద్య (ఐటీఐ)ను అభ్యసించిన ముగ్గురు యువకులు ప్రజలకు ఉపయోగపడే పనులు చేయకుండా పక్కదోవ పట్టారు. జల్సాలకు అలవాటు పడి త్వరగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో మోస మార్గాన్ని ఎంచుకున్నారు. ‘కూల్ సాండీ’ అనే యాప్‌తో మోసపోకండి అనే చిత్రాన్ని చూపి ప్రజలను మోసం చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. ‘నవభారత్ ఎలక్ట్రానిక్స్ ప్రాజెక్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్’ అనే కంపెనీ పేరుతో ఒక బ్రోచర్‌ని తయారు చేసి పేపర్లలో ప్రకటన కూడా ఇచ్చారు. ‘మా కంపెనీ ఎల్ఈడీ బల్బులు మీ ఇంటి వద్దనే ఉండి ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు సంపాదించండి’ అంటూ కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపురం, హైదరాబాద్, గుంటూరు, వరంగల్, నెల్లూరు జిల్లాల్లో ప్రకటనలు ఇచ్చి మోసగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆదోని పోలీసులు ఈ కేసు ఛేదించారు. నిందితులను అరెస్ట్ చేసి కటకటాల్లోకి పంపారు. ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపిన వివరాల మేరకు...

ఆకర్షణీయమైన బ్రోచర్లతో..

ఆదోని పట్టణం పూలబజార్ కాలనీకి చెందిన కాలువ నరసింహులు, కార్వన్‌పేటకు చెందిన బెస్త సంజయ్, శ్రీనివాసులు అలియాస్ చేతన్‌కుమార్ అనే యువకులు ఐటీఐ చేశారు. ఈ ముగ్గురికి ఆదోని పట్టణం అమరావతినగర్‌కు చెందిన మహ్మద్‌సులేమాన్, అలాగే బార్‌పేటకు చెందిన మహబూబ్‌బాషా తోడయ్యారు. వీరు నవభారత్ ఎలక్ట్రానిక్స్ ప్రయివేట్ లిమిటెడ్ అనే కంపెనీ పేరుతో ఒక బ్రోచర్‌ను తయారు చేశారు. అందులో కంపెనీ ఎల్ఈడీ బల్బులకు సంబంధించిన పార్ట్స్, ఒక వారానికి సరిపడే 350 బల్బులను పార్శిల్ పంపుతామని, వాటిని ఫిట్టింగ్ చేసి తమ రెప్‌కు ఇవ్వాలని, ఒక బల్బు ఫిటింగ్‌కు రూ.15 ఇస్తామని వివరాలు పొందుపరిచారు. రోజుకు 50 బల్బులు ఫిట్ చేస్తే రూ.750 సంపాదించుకోవచ్చని ప్రజలను నమ్మించారు. కొంత మందికి తమకు బల్బు ఫిట్ చేయడానికి రాదు కదా అని ఫోన్ చేసి ప్రశ్నిస్తే.. వాట్సాప్ ద్వారా ఎలా ఫిట్ చేయాలనే డెమో పంపించి నమ్మించారు. ప్రతివారం 350 బల్బులను ఫిట్ చేసి తమ రెప్‌కు ఫోన్ చేస్తే వాహనంలో వచ్చి తీసుకెళ్తారని, రూ.5250 ఇస్తారని చెప్పారు. అంతేగాకుండా బ్రోచర్‌లో పెద్దపెద్ద కంపెనీలకు చెందిన వారి పేర్లు కూడా నమోదు చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకునేవారు ముందుగా రూ.1,050 చెల్లిస్తే 48 గంటల్లో అపాయింట్‌మెంట్ లెటర్, ఫిట్టింగ్ చేయాల్సిన బల్బుల పార్శిల్‌ను ఇంటికి పంపిస్తామని చెబుతారు. అంతేగాకుండా ఆ చార్జీలు, ఈ చార్జీలు అంటూ రూ.18 వేల వరకు డబ్బును బ్యాంకు ఖాతాలో ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు.

సిమ్‌కార్డులు మరుస్తూ..

మహ్మద్‌సులేమాన్ ఐడీ ప్రూఫ్ లేకుండా ఏడు సిమ్‌కార్డులు తీసుకొని సదరు నంబర్‌లను ప్రకటనలో ఇస్తూ ఆ నంబర్‌లతో వాట్సాప్ కాల్ ద్వారా కష్టమర్లతో మాట్లాడుతుండేవాడు. మహబూబ్‌బాషా అనే వ్యక్తి నకిలీ ఐడీ కార్డును తయారు చేయించుకొని ఎవరికీ అనుమానం రాకుండా గుర్తుపట్టని విధంగా ట్రూకాలర్ ఐడీలో నకిలీ పేర్లను, ఫొటోలను నమోదు చేసుకున్నాడు. వాట్సాప్‌లో డీపీల్లో క్రియేట్ చేసిన లోగోను పెట్టుకొని ప్రజల వద్ద రిజిస్ట్రేషన్ చార్జెస్, ఇన్సూరెన్స్ చార్జెస్, ట్రైనింగ్, ట్రాన్స్‌పోర్టేషన్, జీఎస్టీ, కిట్ చార్జీల పేరుతో విడతలవారీగా ఒక్కొక్క వ్యక్తి వద్ద రూ.1050 నుంచి రూ.18 వేల దాకా బ్యాంక్ ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయించుకునేవాడు. వారికి పని కల్పించకుండా ఎప్పటికప్పుడు సిమ్ కార్డులను మారుస్తూ ఎనిమిది జిల్లాల నుంచి దాదాపు వెయ్యి మందికి పైగా కష్టమర్ల నుంచి రూ.53 లక్షలు బ్యాంకు ఖాతాల్లో ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. అందులో రూ.30.60 లక్షలు అవసరాల నిమిత్తం విలాసాలకు, జల్సాలకు ఖర్చు చేసి వాడుకున్నారు.

ప్రజలూ..మోసపోవద్దు

‘పని, ఉద్యోగం ఇస్తాం.. ఇంటి వద్దనే సంపాదించుకోండి’ అనే ప్రకటనలను చూసి ప్రజలు మోసపోవద్దని, అలాంటి వారిని నమ్మరాదని డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, ఆన్‌లైన్‌లో వచ్చే లింకులను చూసి ఓపెన్ చేయవద్దన్నారు. ఆన్‌లైన్‌లో ఎట్టిపరిస్థితుల్లో డబ్బు పంపవద్దని, ఇలాంటి ప్రకటనలు వస్తే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

స్పందనలో ఫిర్యాదు.. నిందితుల ఆట కట్టు

కర్నూలు నగరంలోని కల్లూరు ఎస్టేట్‌కు చెందిన నాగపుల్లయ్య బ్రోచర్‌ను చూసి మోసపోయాడు. రూ.10 వేలు డబ్బును ట్రాన్స్‌ఫర్ చేశారు. వారి ఫోన్‌లు పనిచేయకపోవడంతో మోసపోయానని తెలుసుకుని కర్నూలులోని స్పందన ద్వారా ఫిర్యాదు చేశాడు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు ఆదోని వన్‌టౌన్ సీఐ విక్రమసింహా, సిబ్బంది హాజీబాషా, రామచంద్ర, మహేశ్వరప్ప, లక్ష్మణ్‌లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ఫోన్ టెక్నాలజీ, సాంకేతిక పరిజ్ఞానంతో కేసును ఛేదించారు. ఆదోని పట్టణం టీజీఎల్ కాలనీలో నుంచి మైనార్టీ కాలనీకి వెళ్లే దారిలో ఈద్గా వద్ద ఐదుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి మూడు సెల్ ఫోన్లు, బ్యాంకు పాసు పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. వారి సంబంధీకుల వివిధ బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.18.66 లక్షలను ఫ్రీజ్ చేశారు. రికవరీ చేసిన డబ్బునుపై అధికారుల సూచనల మేరకు బాధితులకు కోర్టు ద్వారా అందజేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులను అభినందించారు.

శారీరక వికలాంగులకు హాస్టల్ వసతి

- దరఖాస్తుకు ఈనెల 25 ఆఖరు

కర్నూలు(అర్బన్): నగరంలోని సి.క్యాంప్ సెంటర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ శారీరక వికలాంగుల వసతి గృహంలో ప్రవేశానికి అర్హులు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప జిల్లాలకు చెందిన శారీరక వికలాంగులైన విద్యార్థులు 3వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర కోర్సులు చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి 100 మంది విద్యార్థులకు వసతి కల్పిస్తామన్నారు. బి.క్యాంప్‌లో రూ.2.86 కోట్ల వ్యయంతో ప్రభుత్వం నూతన వసతి గృహాన్ని నిర్మిస్తోందని.. దాదాపు 90 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. మరిన్ని వివరాలకు 9393712179, 9989309021, 08518-277864 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

నిర్వహణ ఇలా ఉంటే ఎలా?

- అంగన్‌వాడీ సిబ్బందిపై మంత్రి ఉషశ్రీ చరణ్ ఆగ్రహం


అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులతో మాట్లాడుతున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్


స్కూల్ విద్యార్థినికి భోజనం తినిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

ఎమ్మిగనూరురూరల్: మాతా, శిశు సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ హెచ్చరించారు. రిజిష్టర్లు సక్రమంగా లేకపోవడంతో ఎమ్మిగూరు పట్టణంలోని అంగన్‌వాడీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రాలయానికి వెళ్తూ గురువారం ఆమె ఎమ్మిగనూరు పట్టణం సంజీవయ్య నగర్‌లోని 25, 26, 27 అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్‌ను పరిశీలించారు. రిజిష్టర్లు సక్రమంగా లేకపోవటంతో పీడీవో, సీడీపీవో, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా లేకపోతే సంబంధిత అధికారులపై శాఖా పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం గర్భిణులతో మాట్లాడి..పౌష్టికాహారం అందుతుందో లేదో ఆరా తీశారు. చిన్నారుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలపై జిల్లా ప్రాజెక్ట్ అధికారి, సీడీపీవో, సూపర్‌వైజర్ల పర్యవేక్షణ ఉండాలన్నారు. నాడు-నేడు ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు.రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ నేత జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ రాజశేఖర్, రియాజ్ అహమ్మద్, సునీల్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరమ్మ, సీడీపీఓ సఫర్నీసాబేగం, ఐసీడీపీఓ మద్దమ్మ తదితరులు ఉన్నారు.

పిల్లలకు మధ్యాహ్న భోజనం తినిపించిన మంత్రి

పట్టణంలోని సంజీవయ్య నగర్ అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ తనిఖీ చేశారు. అక్కడి నుంచి బయటకు వస్తుండగా ఎంపీపీ పాఠశాల విద్యార్థులు ప్లేట్‌లో మధ్యాహ్న భోజనం పెట్టుకొని రావటాన్ని మంత్రి గమనించారు. వారిని ఆపి ప్లేట్‌లో భోజనం కలిపి పిల్లలకు తినిపించారు. భోజనం బాగా పెడుతున్నారా, ఎలా ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు మంచి పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తోందన్నారు. వంట ఏజెన్సీల నిర్వాహకులు మెనూ తప్పక పాటించాలన్నారు. మధ్యాహ్న భోజనంపై హెచ్ఎం, ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

ప్రజలతో మర్యాదగా మెలగండి


ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ వాహనాలను పరిశీలిస్తున్న డీఐజీ సెంథిల్‌కుమార్

బొమ్మలసత్రం: పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని డీఐజీ సెంథిల్‌కుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని తాలూకా, టూటౌన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్‌లలో సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు, నేరాల పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలపై దాడులను అరికట్టాలన్నారు. పెండింగ్ కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఆదేశించారు. నిందితులు కోర్టులో తప్పించుకోకుండా బలమైన ఆధారాలు కోర్టుకు సమర్పించి శిక్షపడేలా చేయాలన్నారు. సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలపట్ల ప్రజలను చైతన్య పరచాలని చెప్పారు. దిశయాప్ ఉపయోగాలు, 112, 100 నంబర్ల వినియోగంపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలన్నారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించరాదన్నారు. డీఐజీ వెంట జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐలు, ఎస్ఐ ఉన్నారు.

డీఐజీని కలిసిన ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాలకు వచ్చిన డీఐజీ సెంథిల్‌కుమార్‌ను ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలపై ఆయనతో ఎమ్మెల్యే చర్చించారు.

15 మంది వీఆర్వోలు, 46 మంది సర్వేయర్ల బదిలీ


సర్వేయర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 15 మంది వీఆర్వోలు, 46 మంది సర్వేయర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వీఆర్వోలు, సర్వేయర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మ్యూచువల్, స్పౌజ్, అనారోగ్యం, వికలాంగులు తదితర విభాగాల్లో బదిలీ కోసం సచివాలయ ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో భాగంగా వీఆర్వోలకు డీఆర్వో ఎస్వీ నాగేశ్వర రావు ఆధ్వర్యంలో, సర్వేయర్లకు ఆ శాఖ ఏడీ రామ్మోహన్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ చేపట్టారు. 15మంది వీఆర్వోలు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోగా అందరూ బదిలీపై వెళ్లారు. 48మంది సర్వేయర్లకు 46మంది మాత్రమే బదిలీ కాగా, ఇద్దరు మళ్లీ వారి పాత స్థానాలనే కోరుకున్నారు.

క్లుప్తంగా

నేడు ఏపీ ఈఆర్‌సీ చైర్మన్ కర్నూలు రాక

కర్నూలు(రాజ్‌విహార్): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీ ఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి శుక్రవారం కర్నూలుకు రానున్నారు. నగర శివారులోని దిన్నెదేవరపాడులో ఉన్న 220 కేవీ సబ్‌స్టేషన్ స్థలంలో ఈఆర్‌సీ ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేసేందుకు భూమి పూజ నిర్వహించనున్నారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ..

తుగ్గలి: అంత్యక్రియలకు వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మారెళ్లకు చెందిన మహమ్మద్‌రఫి(42) మద్దికెర మండలం పెరవలిలో బంధువు అంత్యక్రియలకు టీవీఎస్‌ఎక్స్‌ఎల్ బైక్‌పై బుధవారం సాయంత్రం వెళ్లాడు. అక్కడ అంత్యక్రియలు ముగించుకొని రాత్రి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో తుగ్గలి చెరువు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం అటుగా పొలానికి వెళుతున్న ఓ రైతు మృతదేహాన్ని చూసి సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ మల్లికార్జున ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య పీరాంబీ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్(ఆర్ట్, వర్క్, వ్యాయామ విద్య) బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్ డాక్టర్ కె వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీలలోపు దరఖాస్తులను సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

యువకుడి ఆత్మహత్య

ఓర్వకల్లు: క్షణికావేశానికి గురై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని నన్నూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన తెలుగు మద్దిలేటి కుమారుడు తెలుగు మహేష్(20) హైదరాబాద్‌లో పెయింటర్‌గా పని చేస్తున్నాడు. మూడు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. బుధవారం రాత్రి పనికి వెళ్లమని తండ్రి మందలించడంతో మనస్తాపం చెంది తెలుగు రామకృష్ణ కళ్లంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

‘జగనన్న ఆణిముత్యాల’కు పురస్కారాలు

- నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలు
- ఈ నెల 17న జిల్లా స్థాయి కార్యక్రమం

కర్నూలు సిటీ: ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివి పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ‘జగనన్న ఆణిముత్యాలు’ పేరిట ప్రభుత్వం పురస్కారాలు అందిస్తోంది. ఇందులో భాగంగా గురువారం నియోజకవర్గ స్థాయిలో పురస్కారాలను అందజేశారు. వివిధ యాజమాన్యాలకు చెందిన స్కూళ్లలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి మెడల్, మెరిట్ సర్టిఫికెట్స్‌ను అందించారు. వీరితో పాటు సంబంధిత స్కూళ్లకు జ్ఞాపికలు ఇచ్చి, హెచ్ఎంలను సైతం సన్మానించారు. ఆదోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, కోడుమూరు హైస్కూల్‌లో ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్, ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే తనయుడు జగన్‌మోహన్ రెడ్డి, ఆలూరులో మంత్రి సోదరుడు నారాయణ స్వామి పురస్కారాలను అందజేశారు. ఇదిలా ఉండగా జగనన్న ఆణిముత్యాల పురస్కారాల జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ఈ నెల 17న నిర్వహించనున్నారు. సునయన ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరుగునుంది.

దిశయాప్‌తో అన్ని విధాలా రక్షణ


దిశయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నామంటూ మొబైల్ ఫోన్‌లను చూపుతున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సీ.క్యాంప్ రైతుబజారులో వినియోగదారులు, రైతులు, పొదుపు మహిళలు పోటీపడి దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. గురువారం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు చెందిన మహిళ కానిస్టేబుళ్ల పరిమళ, యామిని తదితరులు రైతు బజారుకు వెళ్లి దిశయాప్‌పై అవగాహన కల్పించారు. ఆపదల్లో ఉన్నవారికి దిశయాప్ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. రైతుబజారు ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, ఉద్యాన కన్సల్టెంటు శివకుమార్ మాట్లాడుతూ... దిశయాప్ మన చేతిలో ఉండటం వల్ల అన్ని విధాల రక్షణ లభిస్తుందని తెలిపారు. రైతుబజారులో 100 మందికిపైగా దిశయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం అభినందనీయమన్నారు. సెక్యూరిటీ సిబ్బంది శ్రీనివాసరెడ్డి, చిన్నస్వామి, గురువయ్య, సంజీవరెడ్డి, గోపాల్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.